
జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 06 | పేజీలు : 8 | బుధవారం | 14 జనవరి 2026 | వెల : 2/-

## మీడియాపై సిట్ వేశారు సరే... మీ నేతల స్కాంలపై ఎందుకు వేయలేదు? - కేటీఆర్



- సీఎం, మంత్రి, ఓ ఐఏఎస్ అధికారిణిపై పోస్టులు
- విచారణకు సిట్ వేసిన తెలంగాణ సర్కారు
- తీవ్రస్థాయిలో స్పందించిన కేటీఆర్
- పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ ఎత్తుగడలని విమర్శ
- కాంగ్రెస్ నేతల అవినీతి, కబ్జాలపై విచారణ ఏదని సూటి ప్రశ్న
- మీడియా సంస్థలపై దర్యాప్తు పేరుతో వేధించడం సరికాదని హెచ్చరిక

మిగతా 2 లో..



## మేడారం జాతరకు టీజీఎస్ఆర్టీసీ
# ప్రత్యేక బస్సులు
## - మహిళలకు ఉచిత ప్రయాణం

- ఈసారి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి 3,49 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం
- ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో జాతర
- జాతరకు అవసరమైతే మరిన్ని బస్సులు నడిపే విధంగా కార్యాచరణ

డెస్క్, జనవరి 13 (తొలివెలుగు): మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు టీజీఎస్ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి 3,495 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో జాతర జరగనుంది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనంగా వసూలు చేయాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి అనుమతి ఉంది. గత జాతర సమయంలో ఆర్టీసీ 3,491 ప్రత్యేక బస్సులు నడిపినప్పటికీ, కీలక సమయాల్లో అవి సరిపోకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని ఆర్టీసీ తెలిపింది. ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది.

## లక్ష కోసం
### ఆడబిడ్డను విక్రయించిన దంపతులు



డెస్క్, జనవరి 13 (తొలివెలుగు) : పేదరికమో లేదా ఆడపిల్లనే భారమనుకున్నారో కానీ, కన్న పేగు బంధాన్ని తెంచుకుని ఆ పసికందును విక్రయించిందో జంట. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం లాల్సింగ్ తండాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ శిశు విక్రయ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. లాల్సింగ్ తండాకు చెందిన వాడ్యావత్ రేణుక గతేడాది నవంబరు 9న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నిబంధనల ప్రకారం గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది. అయితే, జనవరి 1 నుంచి రేణుక కేంద్రానికి రాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్త చింటుకు అనుమానం వచ్చి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు 'ఆపరేషన్ స్మైల్ల టీంతో కలిసి విచారణ చేపట్టగా షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి. ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన గోవింద్ అనే మధ్యవర్తి ద్వారా రేణుక దంపతులు తమ బిడ్డను హైదరాబాద్‌కు చెందిన ఒక కుటుంబానికి విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ బేరం సుమారు లక్ష రూపాయలకు కుదిరినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి శిశువును స్వాధీనం చేసుకుని, సురక్షితంగా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. 'ఆపరేషన్ స్మైల్ల కార్యక్రమంలో భాగంగా పోలీసులు తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు, అక్రమ రవాణాకు గురైన శిశువులను గుర్తిస్తున్నారు. ఈ కేసులో మధ్యవర్తి గోవింద్‌తో పాటు, బిడ్డను కొనుగోలు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణ చారిత్రక మైలురాయి
### - ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఖరీఫ్ సీజన్‌లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- గతంలో 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించినట్లు వెల్లడి
- రైతుల భాగస్వామ్యంతో రికార్డు సాధ్యమైందని వెల్లడి



డెస్క్, జనవరి 13 (తొలివెలుగు) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయిని అధిగమించిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించినట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ జరుపుకుంటున్న రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకాలని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ఈ దిగుబడికి రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామని ఆయన అన్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు
### తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ

- మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడి
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధిక ఓటర్లు
- కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 మంది ఓటర్లు

2





# భూభారతి పోర్టల్‌లో అక్రమాలు.. ఏడుగురిపై కేసు

- సర్కారు ఆదాయానికి ఆపరేటర్ల కన్నం!
- వలిగొండలో వెలుగుచూసిన రిజిస్ట్రేషన్ల మాయాజాలం
- తక్కువ స్టాంపు డ్యూటీ చూపి ప్రభుత్వ ఆదాయానికి గండి
- రూ. 15.58 లక్షల గోల్‌మాల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- ఏడుగురు ఆపరేటర్లపై క్రిమినల్ కేసులు
- వలిగొండ తహసీల్దార్ ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు




వలిగొండ, జనవరి 13 (తొలివెలుగు) : భూభారతి పోర్టల్ ద్వారా జరుగుతున్న భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. ప్రభుత్వానికి రావాల్సిన స్టాంపు డ్యూటీని తక్కువగా చూపిస్తూ ఆదాయానికి గండి కొట్టిన భూభారతి ఆపరేటర్లపై వలిగొండ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్కువ స్టాంపు డ్యూటీ చెల్లించిన రిజిస్ట్రేషన్ కేసులపై అధికారులు ప్రత్యేక విచారణ చేపట్టారు. ఈ విచారణలో వలిగొండ మండలానికి చెందిన భూభారతి ఆపరేటర్లు కలకూరి మధు, భువనేష్, బసవరాజు, రాజు, రాకేష్, శివరామకృష్ణ, తరుణ్ లు రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీని కావాలని తక్కువగా నమోదు చేసినట్లు నిర్ధారణ అయింది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు మొత్తం రూ. 15,58,472 మేర నష్టం వాటిల్లినట్లు గుర్తించిన వలిగొండ తహసీల్దార్ దశరథ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.

# తెలంగాణలో 9 జిల్లాల్లో రైస్ మిల్లులపై దాడులు

## - భారీ అక్రమాలు వెలుగులోకి



డెస్క్, జనవరి 13 (తొలివెలుగు) : తెలంగాణలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీ&ఈ) అధికారులు కొరడా ఝుళిపించారు. 9 జిల్లాల్లోని 19 రైస్ మిల్లులపై ఏకకాలంలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో రూ.60 కోట్లకు పైగా విలువైన ధాన్యం దారి మళ్లినట్లు గుర్తించారు. ఈ అక్రమాలకు సంబంధించి 14 మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, ఒక మిల్లును మూసివేశారు.

ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు (కస్టమ్ మిల్లింగ్ రైస్ - సీఎంఆర్) రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. ఈ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తుంది. అయితే, జనవరి 12న మహబూబాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సూర్యాపేట, నల్గొండ, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మిల్లులపై దాడులు జరిగాయి. ఈ తనిఖీల్లో 14 మిల్లుల్లో అక్రమాలు జరిగినట్లు తేలింది. మొత్తం 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం, 1.72 లక్షల బస్తాలు మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. ప్రధానంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రూ.19.73 కోట్లు, సూర్యాపేటలో రూ.19.32 కోట్లు, నారాయణపేటలో రూ.15.91 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నష్టాన్ని రాబట్టాలని, వారి లైసెన్సులను రద్దు చేసి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని పౌరసరఫరాల శాఖకు సిఫార్సు చేశారు. తీవ్రమైన ఉల్లంఘనల కారణంగా పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలం, పూసాల గ్రామంలోని జానకీరామ ఇండస్ట్రీస్‌ను మూసివేశారు.

ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని ఏమాత్రం సహించబోమని విజిలెన్స్ డీజీ శిఖా గోయల్ స్పష్టం చేశారు. "నిఘా వర్గాల సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించి భారీ మోసాన్ని బయటపెట్టాం. మరో ఐదు మిల్లులకు రికార్డుల నిర్వహణలో లోపాలపై నోటీసులు జారీ చేశాం" అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

2025-26 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అయితే, ఇలాంటి అక్రమాలు ప్రభుత్వ లక్ష్యాలకు గండికొడుతున్నాయి. భవిష్యత్తులోనూ తనిఖీలు కొనసాగుతాయని, ఎవరైనా అక్రమాలను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

# చైనా మాంజా వినియోగం

## హైదరాబాద్ సీపీ సజ్జనార్‌కు మానవ హక్కుల కమిషన్ నోటీసులు



డెస్క్, జనవరి 13 (తొలివెలుగు) : చైనా మాంజాకు సంబంధించి హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌కు తెలంగాణ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. రామారావు ఇమ్మానేని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. చైనా మాంజాకు సంబంధించి తక్షణమే నివేదిక సమర్పించాలని సీపీని ఆదేశించింది.

సంక్రాంతి పండుగ సమయంలో చైనా మాంజా ప్రాణాంతకంగా మారుతోన్న విషయం తెలిసిందే. ఈ అంశంపై న్యాయవాది రామారావుతో పాటు పలువురు ఇతర న్యాయవాదులు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ నేపథ్యంలో మాంజా అమ్మకాలను, వినియోగాన్ని నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలపై సమగ్ర నివేదికను అందించాలని సీపీని మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. ఫిబ్రవరి 26వ తేదీలోగా పోలీసులు చేపట్టిన చర్యల నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

చైనా మాంజా నైలాన్ లేదా సింథటిక్ పదార్థంతో త-యారవుతుంది. ఈ దారానికి గాజు ముక్కల పొడిని అద్దుతారు. ఈ దారంతో పతంగులను ఎగురవేసిన సందర్భాలలో పక్షులు గాయపడటం, కొందరు మనుషులు కూడా ప్రాణాలు కోల్పోవడం జరిగింది. బైకులపై వెళ్లేవారికి ఈ దారం మెడకు తగిలితే ప్రమాదకరంగా పరిణమించి కోసుకుపోయే అవకాశం ఉంది. ఇటీవల చైనా మాంజా కారణంగా పలువురు మరణించారు. ఈ నేపథ్యంలో చైనా మాంజా వినియోగంపై మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది.

# మీడియాపై సిట్ వేశారు సరే... మీ నేతల స్కాంలపై ఎందుకు వేయలేదు? - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 13 (తొలివెలుగు): తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రభుత్వం తరచూ కమిషన్‌లు, ప్రత్యేక దర్యాప్తు బృందాల (సిట్) పేరుతో 'అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు' ఆడుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఒక మంత్రికి సంబంధించిన వార్తను ఉటంకించినందుకు మీడియా సంస్థలపై సిట్ వేయడాన్ని తప్పుబట్టిన కేటీఆర్, సొంత పార్టీ నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలపై మాత్రం ఎందుకు విచారణ జరపడం లేదని సూటిగా ప్రశ్నించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయని చెబుతున్న పలు ఘటనలను కేటీఆర్ తన ప్రకటనలో ఏకరవు పెట్టారు. "ఒక మంత్రి పీఏ, రేవంత్ సహచరుడు కలిసి పారిశ్రామికవేత్త తలకు తుపాకి పెట్టి రూ.300 కోట్లు డిమాండ్ చేస్తే దానిపై సిట్ లేదు. ములుగు జిల్లాలో మంత్రి పీఏ ఇసుక దందాలో కోట్లు దండుకుంటే చర్యలు లేవు. రెవెన్యూ మంత్రి కుమారుడు వందల కోట్ల భూకబ్జాకు పాల్పడితే, కేసు పెట్టిన పోలీస్ అధికారి బదిలీ అయ్యారు కానీ, కబ్జాపై విచారణ లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.

అంతేకాకుండా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఓ కాంట్రాక్టర్‌ను రూ.8 కోట్ల కోసం బెదిరించారని, కస్తూర్బా గాంధీ పాఠశాలల బంకర్ బెడ్స్ కొనుగోలులో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ వివాదం, చీప్ లిక్కర్ కంపెనీలకు అక్రమ అనుమతులు వంటి అనేక స్కామ్‌లపై ప్రభుత్వం ఎందుకు సిట్ వేయలేదని ఆయన నిలదీశారు. యూనివర్సిటీ భూముల అమ్మకంలో భారీ మోసం జరిగిందని సుప్రీంకోర్టు కమిటీయే తేల్చినా విచారణ జరపకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

"అధికార పక్షానికి సన్నిహితంగా ఉండే ఓ టీవీ ఛానెల్ వేసిన వార్తను కేవలం ఉటంకించినందుకు అనేక ఛానెళ్లపై, డిజిటల్ మీడియాపై సిట్ ఏర్పాటు చేశారు. అసలు వార్త వేసిన వారిని వదిలేసి, ఈ కొత్త డ్రామా ఎవరిని కాపాడటానికి? ఎవరిని వేటాడటానికి?" అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రశ్నించే మీడియా గొంతుకలపై వేధింపులు ఆపకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు


## తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 13 (తొలివెలుగు) : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు, 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా, కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా, అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా రిజర్వేషన్లు ఖరారైన తర్వాత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలక శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

# ఇకపై నో 10 మినిట్స్ డెలివరీ..

## డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్




డెస్క్, జనవరి 13 (తొలివెలుగు) : డెలివరీ రంగంలో తీవ్ర విమర్శలకు దారితీసిన '10 నిమిషాల డెలివరీ' విధానానికి ముగింపు పడనుంది. డెలివరీ పార్ట్‌నర్ల (గిగ్ వర్కర్లు) భద్రత, సంక్షేమంపై వెల్లువెత్తిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుంది. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటో వంటి ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థలు ఈ వేగవంతమైన డెలివరీ హామీని ఇకపై తమ యాడ్స్‌లో, బ్రాండింగ్‌లో ఉపయోగించకూడదని నిర్ణయించాయి. వివరాల్లోకి వెళితే, కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం న్యూఢిల్లీలో క్విక్ కామర్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. గడువులోగా డెలివరీ చేయాలనే తీవ్ర ఒత్తిడితో డెలివరీ సిబ్బంది రోడ్లపై ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. డెలివరీ సమయానికి సంబంధించిన కఠిన నిబంధనలను తొలగించాలని ఆయన కోరారు. మంత్రి సూచనకు కంపెనీలు సానుకూలంగా స్పందించి, ఈ హామీని స్వచ్ఛందంగా తొలగిస్తామని హామీ ఇచ్చాయి. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే, ప్రముఖ సంస్థ బ్లింకిట్ తన బ్రాండింగ్‌ను మార్చేసింది. '10,000కు పైగా ఉత్పత్తులు 10 నిమిషాల్లో డెలివరీ' అనే పాత ట్యాగ్‌లైన్‌ను తొలగించి, దాని స్థానంలో '30,000కు పైగా ఉత్పత్తులు మీ ఇంటి వద్దకే' అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను చేర్చింది. ఈ మార్పు ద్వారా డెలివరీ వేగం కంటే సేవల నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు సంకేతాలిచ్చింది. గత కొంతకాలంగా '10 నిమిషాల డెలివరీ' విధానంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తమ భద్రత, వేతనాల గురించి గిగ్ వర్కర్ల యూనియన్లు, ముఖ్యంగా ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (×ఫీూ) వంటి సంస్థలు ఆందోళనలు, సమ్మెలు కూడా నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జోక్యం ప్రాధాన్యత సంతరించుకుంది. బ్లింకిట్ బాటలోనే జెప్టో, స్విగ్గీ, జొమాటో వంటి ఇతర సంస్థలు కూడా రానున్న రోజుల్లో తమ బ్రాండింగ్‌లో మార్పులు చేయనున్నట్టు తెలుస్తోంది.

# ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- ఎన్నికల విధులకు సిబ్బంది సిద్ధంగా ఉండాలి
- రాజకీయ పక్షాలకు అతీతంగా పనిచేయాలి
- చౌటుప్పల్ మున్సిపాలిటీలో అవగాహన సదస్సు
- సెలవులు పెడితే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్ భాస్కర్ రావు





చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : ఎన్నికల విధుల్లో ప్రతి ఉద్యోగి పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలక కార్యాలయంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లకు ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సిబ్బందికి సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు రాజకీయ పక్షాలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరామ్ రెడ్డి డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల వివరాలను అదనపు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, సీనియర్ అసిస్టెంట్లు దీప, రఘుపతి, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు సహా మున్సిపల్ కార్యాలయానికి చెందిన అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో కానిస్టేబుల్ దుర్మరణం

- గస్తీలో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీ
- చిన్నబోయిన ఎస్ఎం పేట
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- అనాథలైన ముగ్గురు పిల్లలు
- హిట్ అండ్ రన్ కేసు నమోదు



చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు): సంక్రాంతి పండుగ వేళ ప్రజల ఆస్తులు, ప్రాణాల రక్షణ కోసం రహదారులపై కాపలాకాస్తున్న ఓ రక్షక భటుడు విధి నిర్వహణలోనే దుర్మరణం పాలయ్యారు. ఈ విషాద ఘటనతో పోలీస్ శాఖతో పాటు ఆయన స్వగ్రామం ఎస్ఎం పేట శోకసంద్రంలో మునిగిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, ఎస్ఎం పేట గ్రామానికి చెందిన కోల నరేష్ కుమార్ (38) చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా (పీసీఉ184) విధులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైవేపై దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా అరికట్టేందుకు సోమవారం రాత్రి సహచర కానిస్టేబుల్ భరద్వాజ్‌తో కలిసి ఎన్‌హెచ్ రహదారిపై గస్తీకి వెళ్లారు. మంగళవారం తెల్లవారుజాముున సుమారు 3 గంటల సమయంలో ధర్మోజిగూడెం సమీపంలో రోడ్డుపక్కన నిలిపి ఉన్న వాహనాలను తనిఖీ చేసేందుకు నరేష్ కుమార్ రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు అతివేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు లాస్య, వర్షిణి, ఒక కుమారుడు క్రాంతి మనిత్ ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న నరేష్ అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతుండగా, ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. ఈ విషాద వార్తతో ఎస్ఎం పేట గ్రామమంతా చిన్నబోయింది. ఈ ఘటనపై పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేసి, సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనాన్ని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

# విశ్రాంత ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

- సబ్ ట్రెజరీ అధికారి చేతుల మీదుగా ఆవిష్కరణ
- సంక్రాంతి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు



చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చౌటుప్పల్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని మంగళవారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు భీమిడి మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీఓ) ముఖ్య అతిథిగా హాజరై డైరీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ తర్వాత ఉద్యోగులందరూ నూతన సంవత్సరంలో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఉద్యోగులకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య స్వాగతోపన్యాసం చేయగా, డైరీతో పాటు క్యాలెండర్, వార్షిక ప్రణాళికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాతరాజు ఆగయ్య, ఆర్థిక కార్యదర్శి బడుగు శ్రీరాములు, ప్రచార కార్యదర్శి నారగోని కృష్ణ గౌడ్, సభ్యులు బద్ద వసంత తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థుల ప్రగతికి ‘జట్టు’

- విద్యార్థుల భవిష్యత్తుకు ఇదే కీలక మలుపు
- సందేహాల నివృత్తికి ఉపాధ్యాయులు, యువత తోడ్పాటు
- బీబీనగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు





యాదాద్రి భువనగిరి, జనవరి 13 (తొలివెలుగు): పదవ తరగతి చదువు విద్యార్థుల భవిష్యత్తుకు కీలక మలుపుగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ‘జట్టు’ అనే ప్రత్యేక కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. మంగళవారం బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను జట్టులుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని మరింత మెరుగుపరచడమే ‘జట్టు’ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రతి గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి విద్యావంతులైన యువత స్వచ్ఛందంగా జట్లుగా ఏర్పడి ఇప్పటి నుంచి వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు అండగా నిలవాలని సూచించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దిశానిర్దేశం చేయాలని తెలిపారు. జట్టు సభ్యులు నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ చదువులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అలాగే పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంట్లో చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని, టీవీ, సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచి చదువుపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఆటపాటలను పక్కనబెట్టి రోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి శ్రద్ధగా చదివే అలవాటు చేసుకోవాలని, పదో తరగతి జీవితం లో అత్యంత కీలక దశ అని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతతో పై చదువులకు సులభంగా వెళ్లే అవకాశముంటుందని, జీవితంలో స్థిరపడాలంటే పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరని కలెక్టర్ హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల బతుకులు ఆగమేనా?

- ❖ ఉద్యమకారులను విస్మరిస్తే గత పాలకుల గతే!
- ❖ రాష్ట్ర వ్యతిరేకులు భోగాల్లో.. సాధకులు కష్టాల్లో..
- ❖ హామీలు అమలు చేయకుంటే పతనం తప్పదు
- ❖ టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిస్టఫర్



వలిగొండ, జనవరి 13 (తొలివెలుగు) : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన అసలైన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించాలని టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. వలిగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లిన వారి జీవితాలు నేడు ఛిద్రమయ్యాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఉద్యమకారులే వెన్నెముకగా నిలిచారని, ఆ విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. హామీల అమలులో జాప్యం చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని ఘాటుగా హెచ్చరించారు. ఉద్యమకారుల సంక్షేమాన్ని విస్మరించి, రాష్ట్ర వ్యతిరేకులకు కొమ్ముకాయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



యాదాద్రి భువనగిరి, జనవరి 13 (తొలివెలుగు) : భూభారతి పోర్టల్, రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం ఆయన బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ అభ్యర్థనలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీబీనగర్ మండలంలోని ప్రతి గ్రామానికి సంబంధించిన పెండింగ్ భూభారతి, రిజిస్ట్రేషన్ దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే అంశాలపై అధికారులకు కలెక్టర్ స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. భూ సమస్యలపై భూభారతి పోర్టల్‌లో దాఖలు చేసిన దరఖాస్తులను పాత రికార్డుల ఆధారంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. అర్జీలను తిరస్కరించాల్సి వచ్చిన పక్షంలో, అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని, చిన్నచిన్న కారణాలతో అర్జీలను తిరస్కరించకూడదని సూచించారు. ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని, భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెక్కుల పంపిణీ.. లబ్ధిదారుల్లో హర్షం

- ❖ కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- ❖ చౌటుప్పల్‌లో 83 మందికి లబ్ధి
- ❖ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చెక్కుల అందజేత





చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 49 మందికి కల్యాణ లక్ష్మి, 34 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మునుగోడు సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, బొంగు జంగయ్య గౌడ్, బత్తుల విప్లవ్ కుమార్, తహసీల్దార్ వీరబాయ్, రెవెన్యూ అధికారులు బాణాల రామ్ రెడ్డి, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. తమకు ఆర్థికంగా అండగా నిలిచిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# భారీ ధర పలికిన కొబ్బరికాయల వేలం

- ❖ రూ. 46.05 లక్షలకు పాడిన మహబూబ్ నగర్ వాసి
- ❖ దండు మల్కాపురంలో ముగిసిన టెండర్ ప్రక్రియ
- ❖ జనరల్ స్టోర్ వేలం వాయిదా



చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామ శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవస్థానంలో 2026-27 సంవత్సరానికి గాను కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయించుకునే హక్కుల కోసం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన సి. కార్తీక్ రూ. 46,05,000 లక్షలకు పాడుకుని హక్కులను దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) సల్వాది మోహన్ బాబు వెల్లడించారు. పర్యవేక్షణ అధికారి బాలకృష్ణ సమక్షంలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. కాగా, కిరాణా జనరల్ స్టోర్ నిర్వహణ హక్కుల వేలానికి కేవలం ఇద్దరు మాత్రమే హాజరు కావడంతో నిబంధనల మేరకు దానిని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిరకటి నిరంజన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ❖ విద్యానగర్ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు
- ❖ విజేతలకు బహుమతుల పంపిణీ
- ❖ మనువాదాన్ని తిప్పికొట్టాలి : ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి
- ❖ ఆడపిల్లలను పుట్టనిద్దాం.. పెరగనిద్దాం: గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక





చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను వెలికితీసి అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక అన్నారు. చౌటుప్పల్ విద్యానగర్ కాలనీలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టాలని, ఆడపిల్లలకు ఉన్నత విద్యను అందించాలని కోరారు. అనంతరం రామేశ్వరి మాట్లాడుతూ.. మహిళా హక్కులను కాలరాసే మనువాద పోకడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ చదువు, ఉద్యోగ హక్కుల కోసం పోరాడాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జయమ్మ, రేష్మ, రజిత, అండాలు పాల్గొన్నారు.

# పులిగిల్లలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- మురుగు నీటిని తొలగించిన పాలకవర్గం
- దోమల నివారణే లక్ష్యం : సర్పంచ్ అనూష



వలిగొండ, జనవరి 13 (తొలివెలుగు): 'స్వచ్ఛ పులిగిల్ల' లక్ష్యంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసింది. మంగళవారం గ్రామ ప్రధాన కూడలిలో నిలిచిపోయిన మురుగునీటిని జేసీబీ సహాయంతో సర్పంచ్ పల్లెర్ల అనూష, కార్యదర్శి జోగు సైదులు స్వయంగా పర్యవేక్షించి తొలగింపజేశారు. మురుగు నిల్వ ఉండటం వల్ల దోమల బెడద పెరిగి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించిన సర్పంచ్, వెంటనే స్పందించి నివారణ చర్యలు చేపట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తామని ఆమె పేర్కొన్నారు. చాలా కాలంగా ఉన్న మురుగు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



వరంగల్ పశ్చిమ నియోజక వర్గం, జనవరి 13 (తొలి వెలుగు) : భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరి-ంచుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్రాంతి రైతుల కష్టానికి ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐక్యతతో పండుగలను జరుపుకోవడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. పండుగలు సమాజాన్ని మరింత దగ్గర చేసే సందర్భాలని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈ సంక్రాంతి జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు, కొత్త ఆశలు నింపాలని ఆకాంక్షించారు. రైతులు, కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఈ పండుగ శుభ ఫలితాలు అందించాలని ఆయన కోరుకున్నారు.

# జాతరకు ముస్తాబైన ఆలేటి ఎల్లమ్మ ఆలయం



జనగామ జిల్లా / పాలకుర్తి, జనవరి 13 (తొలి వెలుగు) : పాలకుర్తి మండలం బమ్మెర గ్రామ శివారులో కొలువుదిరిన ఆలేటి ఎల్లవ్వ తల్లి ఆలయం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జాతరకు ముస్తాబై సిద్ధంగా ఉంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలను ఆలయ కమిటీ ఏర్పాటుచేసింది. ఈ జాతర 14వ తేదీన భోగి పండుగతో ప్రారంభమవుతుందని, 15వ తేదీన బండ్లు తిరుగుట కార్యక్రమం, 16వ తేదీన బోనాల సమర్పణ, పట్నాలు కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని గ్రామ సర్పంచ్ జిట్టబోయిన రమ్య ప్రశాంత్ తెలిపారు. ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# నిబంధనలు పాటిద్దాం ప్రమాదాలు అరికడదాం



- 'అరైవ్ అలైవ్ణ ప్రచారంలో భాగంగా పంతంగిలో రోడ్డు భద్రత సదస్సు
- భద్రతా నియమాలపై గ్రామస్తుల ప్రతిజ్ఞ

చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథకుమార్ సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్ ప్రచారం – 2026'లో భాగంగా మంగళవారం చౌటుప్పల్ మండలం, పంతంగి గ్రామంలో గ్రామస్తులతో విలేజ్ లెవెల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్య సదృశ్యమని హెచ్చరించారు. అనంతరం సుమారు 55 మంది గ్రామస్తులతో కలిసి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎస్. కృష్ణమాల్, కె. ఉపేందర్ రెడ్డి, బి. అజయ్ భార్గవ్, హెడ్ కానిస్టేబుల్ నరేష్, ఏఆర్పీసీ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అడిగారు.. ఇచ్చారు.. పనులు మొదలుపెట్టారు!

- ❖ ఇ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ఉదారత
- ❖ 24 గంటల్లోనే పాఠశాల వంటగది నిర్మాణానికి శ్రీకారం



చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు): ఇచ్చిన మాటను 24 గంటల్లోనే నిలబెట్టుకుని ఈఎల్వీ ఫౌండేషన్ చైర్మన్ ఇ ఎల్ వి భాస్కర్ తన ఉదారతను చాటుకున్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని జై కేసారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరైన వంటగది లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఉపసర్పంచ్ బోదాసు స్వాతి వెంకటేష్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన భాస్కర్, సోమవారం శంకుస్థాపన చేసి, మంగళవారం ఉదయమే సొంత నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యపై ఇంత వేగంగా స్పందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దశరథ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. శ్రీనివాసు, ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు నక్క జయసుధ, పాలమాకుల పుష్ప, ఆడెపు గణేష్, భీమిడి రజిత సందీప్, బోనంపాటి స్వాతి బాలరాజు, అలాగే గ్రామ నాయకులు బోదాసు నరేష్, కోర్పూర్ లింగయ్య, బోదాసు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ స్థల పరిశీలన

- దండు మల్కాపురంలో 20 గుంటల భూమి గుర్తింపు
- స్థలాన్ని పరిశీలించిన జేసీ, డీఆర్డీఓ
- మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : జేసీ భాస్కర రావు





చౌటుప్పల్, జనవరి 13 (తొలివెలుగు) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే 'మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా సమాఖ్యకు మంజూరైన పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 486లో ఉన్న 20 గుంటల ప్రభుత్వ భూమిని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (జేసీ) భాస్కర రావు, డీఆర్డీఓ నాగిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. స్థల అనుకూలత, రహదారి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ భాస్కర రావు మాట్లాడుతూ.. మహిళా సమాఖ్యల ద్వారా పెట్రోల్ బంక్ నిర్వహణ చేపట్టడం వల్ల మహిళలకు స్థిరమైన ఆదాయం లభించి, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. బంక్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరాభాయ్, ఆర్ఐ రామ్ రెడ్డి, ఏపీఎం యాదయ్య, మండల మహిళా సమాఖ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.